పరమ పావనమైన భారతావని యందు
సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నిటి యందు వన్నెగాంచిన యట్టి
ఘనసత్యశీలమే కఠిన తపము
మధుర భావంబిది మనదేశమందున్న
మాతృభావము కంటె మాన్యమెద్ది
ప్రాణంబుకంటెను మానంబె ఘనమను
మనదేశ నీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశ నీతులరసి
వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తె
జోర ఏమందు భారత పాలనంబు
ఏనుగెట్టుల తనబలమెరుగలేదొ
అల్పులైనారు భారతీయులు నేడు.

సకలయత్నములాడి సతతంబు చేయుట
అధిక విద్యలు నేర్చి అధికుడగుట
భూమి పండించుట భూచక్రమేలుట
కొలువు చేయుట పొట్ట కొరకె.
పొట్టకోసము క్రిమి పశు పక్షి మృగాదుల్ బ్రతుకలేదె
కాన వాంఛించకయె తృప్తి కలుగునంచు
గట్టిగా తెలిసి గమ్యంబు చేరకున్న
ఇతర జీవులకన్న అరయనరుడు
అధముడేగాని పరికింప అధికుడగునా.

విద్యార్థులారా!

సకల విద్యల సారమే భారతీయ విజ్ఞానము. ఒక్కొక్క దేశము ఒక్కొక్క విధము విజ్ఞానము కలిగి వుంటుంది. అన్ని విధములైన విజ్ఞానములందు కూడను నీతి, నిజాయితీ, సత్యము, త్యాగము, సహనము ఇత్యాది సద్గుణములు సమముగా కూడి వుంటుంటాయి. కాని యీ విద్య భారతీయ విద్యావిధానమందు

విజ్ఞానమునందు ఆచారము, సాంప్రదాయము, మతము, కళ, చదువు ఈ ఐదింటి యొక్క అంగములతో కూడి వుంటున్నది. ఇట్టి పరిపూర్ణమైన విజ్ఞాన తత్వాన్ని ఈ నాటి విజ్ఞులు విస్మరిస్తూ వచ్చారు. ఈ విజ్ఞానమును కాలుచు కాలత బద్ధ ధర్మము. ధర్మము జగత్తులో యే విధముగా అభివృద్ధిగాంచునో దాన్ని పురస్కరించుకొని యే విజ్ఞానము కూడా అభివృద్ధి నందుతుంది. ఈ ధర్మ విజ్ఞానము అభివృద్ధికి సరియైన ఆస్కారము దేశము యొక్క క్షేమము, దేశము యొక్క సౌభాగ్యము. దేశము సుక్షేమంగా సౌభాగ్యంగా వుండవలెనన్న ధర్మవిజ్ఞానములు అత్యవసరము.

వ్యాస, వాల్మీకులు పవిత్రమైన మహర్షులు. లోకదాతయైన భగవత్తత్వాన్ని శ్లోకరూపంలో ధరింప చేసి జగత్తునకు ఈ విజ్ఞాన ధర్మములను ప్రకటించుతూ వచ్చారు. కాని వారు వ్రాసిన పురాణములు చాలా పురాతనమైనవి. ఇవి పురాతనమైన నీతులు కనుకనే పురాణములని పేరు వచ్చింది. భారత రామాయణములు భారత దేశమునకే కాక యావత్ప్రపంచమునకు ఆదర్శమైన ధర్మములను ప్రబోధిస్తూ వచ్చాయి. ప్రాచీన కాలము నుండి అన్ని దేశములకు సుస్థిరశాంతి భద్రతలను చేకూర్చుకుంటూ వచ్చింది ఈ భారతీయ సంస్కృతియే. ఎట్టి బాధము, ఎట్టి విధము యొక్క సంబంధము కలగనప్పటికిని 'లోకాస్సమస్తా సుఖినో భవంతు' అన్నది ఆర్య సాంప్రదాయము. ఇది ప్రధానమైన ఏకత్వముతో కూడిన దివ్యమైన మంత్రము. దేశకాల వస్తు ప్రభావములు ఏమాత్రమును అనుసరించక సమస్తము ఏకత్వముగా భావించి, దివ్యత్వముగా విశ్వసించి ప్రబోధించిన ప్రచారము ఇదియే. నేను నావారు అనే సంకుచిత భావములు త్యజించి సర్వులు కూడా సుఖంగా వుండాలనేటువంటి విజ్ఞానాన్ని ప్రబోధించింది భారత సంస్కృతి. ఈ ధర్మమును పురస్కరించుకొనియే సకల భోగభాగ్యములు కలిగిన సకల సంపత్తితో అర్థబలము అంగబలము, జనబలము, భుజబలము, బుద్ధిబలము వున్న దుర్యోధన దుశ్శాసనాదులను యేమాత్రమూ అభిమానించక కేవలము వ్యాసులవారు ధర్మజునే అభిమానించటములో వున్న అంతరార్థము ఏమిటి? ఆనాటి మహనీయులు ధర్మమే ప్రధానమనే టువంటి లక్ష్యమును తీసుకొని, ధర్మము వలననే ఈ జగత్తు నడవబడుతున్నదనే సత్యాన్ని గుర్తించి సమస్త భారతీయ కర్మము లన్నియు ధర్మముపై ఆధారపడి వున్నవనే సత్యాన్ని గుర్తించి వ్యాసులవారు ధర్మజుని అభిమానిస్తూ వచ్చారు. యావత్ప్రపంచమునకే నీతి నిజాయితీలు ప్రబోధించిన రామాయణము ప్రతికుటుంబమునకు ప్రాణ సమానము. కుటుంబములో అన్నదమ్ములు ఏ విధంగా మెలగాలి, తండ్రి ఆజ్ఞను యే విధంగా శిరసావహిం

చి ప్రవర్తించాలి, భార్య భర్తల యొక్క సంబంధమును యే విధమైన సహన భావంతో అనుభవించాలి ఈ విధముగా కుటుంబమునకు సంబంధించిన సంబంధ బాంధవ్యాన్ని చక్కగా నిరూపించినది రామాయణము. అన్నదమ్ములలో వున్న ఏకమత్యమును అనురాగ సంబంధము, ప్రేమతత్వమును కుటుంబమునకు యే విధమైన టువంటి సత్కీర్తిని గడించుకుంటూ వచ్చినదనే సత్యాన్ని వివరించినది రామాయణము. ఇలాంటి రామాయణమునకు దాత, సృష్టికర్త వాల్మీకి. సకల సౌభాగ్యములతో విలసిల్లు రావణుడు, అతనికి భోగభాగ్యములలో ఎటువంటి కొదువ లేదు. అతనికి సాటియైన వారు జగత్తులోనే కానరారు. అరువదినాలుగు విద్యలు అభ్యసించిన మహాశక్తిమంతుడు. స్వర్గమును కూడా మరిపింప చేసే టువంటిది లంకా పట్టణము. వాల్మీకి అట్టి రావణునిపైన అభిమానము చూపక రాజ్యమును త్యజించి, ఆకులలములు మేసి, అడవులలో జీవిస్తూ, తాపస వేషము ధరించి జీవితము గడుపుతున్న రాముని పైనే అభిమాన పడటంలోని అంతరార్థము ఏమిటి? రాముడు ధర్మస్వరూపుడు. తాను చేసిన ప్రతి ఒక్క పని కూడా ధర్మమయమైనదే. తాను పలికిన ప్రతి పలుకు సత్యస్వరూపమే. తాను పెట్టిన ప్రతి అడుగు ధర్మముపై పడుతూ వచ్చింది. కనుక రామో విగ్రహవాన్ ధర్మః అన్నారు. ఈ మహర్షి ధనకనక వస్తు వాహనాదులపైన అభిమానము వుంచక, భుజబల బుద్ధి బలముపై అభిమానము వుంచక ధర్మముపై అభిమాన పడటంలోని అంతరార్థమేమిటి? జగత్తునకు, మానవ జీవితమునకు, మానవత్వమునకే ధర్మమే ప్రాణము. ధర్మమే ఆధారమనే సత్యాన్ని గుర్తింపచేస్తూ వచ్చారు.

మానవ జీవితమునకు చతుర్విధ పురుషార్థములు ప్రధానమైన సూత్రము. ఆసూత్రములందు కూడను మొట్టమొదటిది ధర్మమే. తదుపరి అర్థకామములు. ధర్మమును అర్థకామములు అనుసరించినప్పుడే అవి కూడా సార్థకమవుతాయి గాని ధర్మమును విసర్జించి అర్థకామములను అనుభవించటం చేత యివి కేవలము క్షోభను కలిగిస్తాయి. కనుక అర్థము కూడ ధర్మమయిమై వుంటుండాలి. మన వాంఛలు కూడా ధర్మమయమై వుంటుండాలి. అప్పుడు మనము ఆశించవలసిన మోక్షము లభ్యమవుతుందని యీ పురుషార్థములు చక్కగా ప్రబోధిస్తూ వచ్చాయి. కాని యీనాడు దురదృష్టవశాత్తూ భారతీయులు ధర్మ అర్థ, కామ, మోక్షము ఈ నాలుగు పురుషార్థములలో ధర్మమనే పాదమును, మోక్షమనే శిరస్సును ఖండించి అర్థకామములనే మొండెము పట్టుకొని జీవితమును గడుపుతున్నారు. దీనివలనే భారతదేశము యీనాడు యిన్ని విధములైన దుఃఖ

ములకు గురికావలసి వచ్చింది. ఈ ధర్మమును విస్మరించటం చేతనే ధరణి కోమలము ధర్మహీనమైన స్వరూపాన్ని ధరిస్తుంటాది. అనేక కష్టములకు, దుఃఖములకు విచారములకు గురౌతూ వస్తున్నాది. కనుక ఇటువంటి పరిస్థితులలో ధర్మమును పుష్కలించి ధర్మమునకు మూలాధారమైన విజ్ఞానమును కూడను పోషించి తిరిగి మరల భారతదేశమును ధర్మపునరుద్ధరణ చేయటానికి కంకణం కట్టుకోవాలి.

భగవద్గీతయందు కూడను ప్రారంభములోనే 'ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః' అనేకమందిని భగవద్గీత యొక్క సారాంశమేమని ప్రశ్నించినప్పుడు ఇందు కర్మ చాలా ప్రధానమని, యోగము చాలా ప్రధానమని, జ్ఞానము చాలా ప్రధానమని, భక్తి చాలా ప్రధానమని అనేకమంది అనేక విధములుగా ఈ భగవద్గీతను చక్కగా వ్యాఖ్యానం చేస్తూ వచ్చారు. ఒక్క స్వరూపాన్ని మనం నిరూపించవలెనంటే పాదములు తల చాలా ప్రధానము. పాదములు తల మనకు చిక్కకుండా పోయినప్పుడు మొండెములో మనము ఏమాత్రము నిర్ణయించలేము. కనుక మొట్టమొదటి శ్లోకంలో

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతాః యుయుత్సవః
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ

ప్రథమ పదము ధర్మము. అంత్యములో

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనంజయః
తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ

కడపటి పదము 'మమ'. ఈ రెండింటిని మనము చేర్చినప్పుడు 'మమ ధర్మ' అని బోధిస్తూ వచ్చింది. కనుక ప్రతివ్యక్తి తమ తమ ధర్మములను గుర్తించి వర్తించటము అత్యవసరమని కూడను ప్రబోధిస్తూ వచ్చింది. గృహస్థుడు గృహస్థ ధర్మమును, వానప్రస్థుడు వానప్రస్థ ధర్మమును, సన్యాసి ధర్మము సన్యాసి, బ్రహ్మచారి బ్రహ్మచారి ధర్మమును ప్రవర్తించాలి. ఎవరికి తగిన ధర్మము వారికే గాని ఒకరిది మరొకరికి చెందటానికి వీలుకాదు. ఈ విధమైన నియమములను పాటించుకుంటూ, ప్రబోధించుకుంటూ విచారము పలుపుతూ వచ్చింది.

అన్నింటికి మూలాధారమైనది మమ ధర్మము. ఈ మమ ధర్మమును మించిన ధర్మము ప్రపంచములో మరొకటి లేదు. ఒకానొక సమయము లోపల తోడర్ నిచ్ అనే జర్మను వేదాంతి 'సంకల్పశక్తి' అనే గ్రంథాన్ని వ్రాస్తూ ఉన్నాడు. దాన్ని వ్రాస్తున్న సమయము లోపల అతను అదృష్టవశాత్తు ఈ మమ

ధర్మము అతనికి చిక్కింది. దాన్ని చూస్తూ చూస్తూ తాను పొందిన ఆనందము వర్ణనాతీతమైనది. తమపరి తాను వ్రాస్తున్న గ్రంథమును ప్రక్కన పెట్టాడు. భారత దేశములో గగన సీమ లోపల సూర్యునివలె ప్రకాశిస్తున్న యీ మహధర్మమునకు ముందు నేను వ్రాసే యీ గ్రంథము కేవలము క్యాండిలు లైటు వంటిదన్నాడు. దీనికి మించిన గ్రంథము ప్రపంచములో మరొకటి కానరాదన్నాడు. ఇలాంటి పవిత్రమైన గ్రంథములుగాని, నీతులుగాని, శాస్త్రములుగాని భారత దేశమందు వుండికూడను భారతీయులు దీనిని విశ్వసించక పరధర్మములను విశ్వసించి జీవితమును వ్యర్థము గావించుకుంటున్నారు. వీరిలో ఒక విధమైన దురభిమానము. ఎంత విలువైనా ఎంత పవిత్రమైనా తన చెంత వుండినప్పటికి పరుల యొక్క తత్వమును ఆకర్షించేదిగా వుండినప్పుడు దురవస్థల పాలై పోతుంటాడు మానవుడు. దీనికే తెలుగులో ఒక పదం వుంది 'ఇంటి యందు చేసిన పంచ భక్ష్య పరమాన్నముల కంటె పక్కింటి లో పాచిపోయిన పప్పు రుచి' అన్నారు. మన యందు యిటువంటి పవిత్రమైన పదార్థములు వుండి కూడను దీనికి యే మాత్రము సాటిరాని సాటిలేని పర తత్వము యొక్క పదార్థమును ప్రేమించటం ఎంత వెర్రితనము.

విద్యార్థులారా! ఏ దేశము యొక్క విజ్ఞానం ఆ దేశము యొక్క ప్రధానం, ప్రమాణం. దీనిని ఎవ్వరూ కూడా విమర్శించరాదు. ఆ దేశకాల పరిస్థితి ప్రభావములను పురస్కరించుకొని ఆయా దేశములకు ఆయా విజ్ఞానములు, ఆయా ధర్మములు ప్రమాణ స్వరూపాన్ని ధరిస్తాయి. కానీ అన్ని ప్రమాణములు కూడను మానసిక పరిశుద్ధము కోసమే. భారతీయ విజ్ఞానము మానవాభ్యుదయమునకు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించేది. ఇట్టి మానవాభ్యుదయమును యే మాత్రము కూడను మనస్సునందు చింతించక ఆదర్శవంతమైన జీవితాన్ని మనము అందించక కేవలము గ్రంథమంతే చదివి విషయాన్ని తెలుసుకున్నంత మాత్రమున చాలదు. తెలుసుకున్న విషయాన్ని ఆచరణలో పెట్టాలి. ఆచరణయందు పెట్టినప్పుడే దీనికి ఆనందము ప్రాప్తిస్తుంది. అట్లు ఆచరణము లేనప్పుడు ఎన్ని గ్రంథములు చదివినప్పటికి యివి ప్రయోజనం లేనివిగా వుంటాయి.

కోటి విద్యలు చదివి గుణము లేకున్నచో
విలువ ఏమి వాని ఫలమదేమి

కనుక గుణము చాలా ప్రధానము. ఇలాంటి గుణమును పురస్కరించుకొనియే ప్రాచీనకాలమునుండి భారతీయులు ఈ గుణ ప్రచారమును సహజమైన రీతిగా చాటుతూ వచ్చారు. భారతీయ తత్వశాస్త్రములుగాని వేదాంత శాస్త్రములుగాని యే విజ్ఞానాన్ని విమ

ర్గించటానికి అధికారమే లేదు. ఈనాటి భౌతిక శాస్త్రము రేపటి దినము పరిశీలన చేసి ఇది కాదని ఖండించి తిరిగి మరుసటి దినమే నూతనమైన ప్రమాణమును పరిశోధన సలుపుతూ వస్తున్నది. కనుక క్షణక్షణమునకు మారిపోయే యీ విజ్ఞాన శాస్త్రము నిత్య సత్యస్వరూపాన్ని ధరించిన భారతీయుల యొక్క సంస్కృతినిగాని లేక తత్త్వశాస్త్రమునుగాని, న్యాయశాస్త్రమునుగాని ఖండించే అధికారము దీనికి ఎక్కడుంటుంది. కాంట్ మొదలు స్పెన్సరు వరకును పరిశోధన చేసిన విషయాలను చక్కగా విచారణ చేస్తే, భారతీయులు పరిశోధన చేసిన ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతము యొక్క కుంభవర్షమునకు వారు చేసిన పరిశోధనలు తుంపరలవలె కనిపిస్తాయి. ఇవన్నీ కేవలము అల్ప స్వరూపము ధరించినవి. ఈనాటి భౌతిక విజ్ఞానము లోపల సాధించిన వన్నియు ఆనాడు కృతయుగము లోపల హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు సాధించిన వాటికన్న ఎక్కువైనవి కావు. హిరణ్యకశిపుడు భూమిని శోధించాడు. ఆకాశమును శోధించాడు. సముద్రమును శోధించాడు. పంచభూతములను హస్తగతము గావించుకున్నాడు. సర్వము తనయొక్క చేతిలో వున్నదని గర్వించాడు.

ఈ అహంకారము చేత కన్నుమిన్ను కానక కన్నకొడుకును కూడా హింసిస్తూ వచ్చాడు. అనగా యీ పరిశోధనల వలన గలిగినటువంటి వుపయోగం ఏమిటి? తనను తాను మరచిపోయి అహంను అభివృద్ధి పరచుకుంటాడు. ఈ అహం వలన తన పర అనే భేదములు లేకుండా పోతున్నాయి. కొడుకు తల్లి అనే భేదం పోతున్నది. తన ఆశకు, భావములకు, ఆకాంక్షకు అడ్డు తగిలినప్పుడు దేనినైనా ఖండించటానికి సిద్ధమవుతాడు. చిట్టకడపటికి తన కొడుకే గొప్ప పాఠము నేర్పుతూ వచ్చాడు. కుమారుడు హరిప్రియుడు. తండ్రి హరిద్వేషి. ఈ రెండింటికి పొత్తు కుదరలేదు. కనుక యీ తత్త్వ శాస్త్రమునకును గాని, భౌతిక శాస్త్రమునకు గాని పొత్తు కుదరని స్థితి యేర్పడింది. కాని ఏనాటికైనా యీ తత్త్వశాస్త్రము ఈ భౌతిక శాస్త్రమునకు బుద్ధి చెప్పక తప్పదు. ఎక్కడ వున్నాడు నీ దేవుడు! అని ప్రశ్నించాడు హిరణ్యకశిపుడు 'ఇందు కలడందు లేడని సందేహము వలదు' అన్నాడు. ఏలా యీ స్తంభములో వున్నాడా! ఉన్నాడున్నాడు. దానిని బద్దలు చేసేటప్పటికి అందులో దివ్యశక్తి ఆవిర్భవించింది. దీని యొక్క అంతరార్థము ఏమిటి? ఎంతకాలము మానవుడు దేహభ్రాంతిని కలిగి దేహాభిమానముతో జీవిస్తూ వుంటాడో అంతకాలము దైవము దూరంగా వుంటాడు. ఏనాడు దేహభ్రాంతిని విసర్జించి దైవభ్రాంతి అభివృద్ధి పరచుకొనునో ఆనాడే అతనికి దివ్యత్వము అర్థమవుతుంది. కనుక దేహమనే దానిని బ్రద్దలు చేశాడు హిరణ్యకశిపుడు. అందుండి ఆవిర్భవించింది దివ్యత్వము.

ఇది హిరణ్యకశిపుని యొక్క చరిత్రలో ప్రధానమైన ఘట్టము. కనుక భౌతిక పై జ్ఞానమును నేటువంటిది అత్యావసరమే. తద్వారా మనము మితిమీరిన అహంకారాన్ని పెంచుకోరాదు, అందరూ తెలుసుకోవలసింది ఎంతోవుందని గుర్తించి వినయ విధేయతలతో జీవించటానికి ప్రయత్నించాలి.

విద్యార్థులారా! మున్ముందు మీరు దేశానికి నాయకులు కావలసినవారు దేశముయొక్క మంచి చెడ్డలంతయు మీతలవ్రాతల పై ఆధారపడి వుంటున్నాది. మీరు మంచివారైనప్పుడే దేశము మంచిదౌతుంది. మీరు దుర్మార్గులైనప్పుడు దేశము దుర్మార్గంగా మారిపోతుంది. కనుక మీరందరు యీ పైజ్ఞాన విషయమందు చక్కగా విచారణ సల్పాలి. ఈనాటి విద్యార్థులకు ఆవగింజంత ఆంగ్లవిద్యను నేర్చుకుంటే గుమ్మడికాయంత అహం ప్రవేశిస్తున్నాది. ఇది చాలా విరుద్ధమైనది. ఇది మంచిది కాదు. అనేక విషయములు మనము ప్రపంచమునకు బోధించవచ్చు. ఈ టన్నులు టన్నులు స్పీచులు యిచ్చేదానికంటె ఒక్క ఔన్సు అనుభవించండి చాలు. కనుక మనం నిత్యజీవితము లోపల ఆచరణయోగ్యమైన దాంట్లో యీ ప్రచార ప్రబోధనలు సల్పాలి. ఈవిధముగా భారతీయ విజ్ఞానము సర్వశాస్త్రముల సారంగా మారి, సర్వవిద్యల గమ్యంగా వుండి జీవితానికి సూత్రంగా మారింది.

ఈ ప్రపంచమంతయూ రెండే రెండు పదార్థములతో కూడి వుంటున్నది. ఏమిటివి? ఒకటి నామము. మరొకటి రూపము. ఈ నామ రూపములు తప్ప యీ ప్రపంచమున మరొకటి యేదియు కానరాదు. ఈనామము శబ్దము. ఈ శబ్దములో ఇమిడి వుంటున్నది జగత్తు. ఈ శబ్దమే వాక్కు. వాక్కుకు ప్రాణమే భావము. భావమునకు ప్రాణమే కోరిక. కోరికలకు ప్రాణమే అజ్ఞానము. అజ్ఞానమునకు ప్రాణమే ద్వైతము. ద్వైతమనే దానినుంచి ఆ జ్ఞానం ఆవిర్భవించింది. కనుక ద్వైతానికి వాక్కుకు సంబంధ బాంధవ్యమును చేకూర్చాలి. వాక్కులేనిది యేమాత్రము కూడ విషయాన్ని గుర్తించుకోలేము. ప్రతిదానికి ఒక శబ్దము. శబ్దమునుండియే మనమంతా ఆవిర్భవించామేగాని మనము శబ్దమును సృష్టించలేదు. కనుక ప్రాచీన కాలమునుండి శబ్దమునకు ఒక అర్థము యేర్పడుతూ వచ్చింది. ఈ అర్థాన్ని ఏ భౌతిక శాస్త్రము కూడ సృష్టించినవాడు కాదు. ఇది ఒక తట్టు. ఈ తట్టును ఎవరు సృష్టించారు. తట్టును goldsmith సృష్టించవచ్చు గాని ఎవరు పేరు పెట్టారు? పేరు ప్రాచీనమునుండి అలవడుతూ వచ్చింది. ఇది ఒక టంబ్లరు. టంబ్లరుకు ఏది ప్రమాణము? రూపమే దీనికి ప్రమాణము కనుక నామమునకు రూపమే ప్రమాణము. రూపమునకు నామమే ప్రమాణము.

102069108

ఈ రెండును అన్యోన్యాశ్రయములు. అవినాభావసంబంధములు. ఈ సత్యాన్ని మనం గుర్తించాలి

ప్రపంచములో ప్రతి ఒక్కదానిని కూడను ఒక పదము వుంటుండాది. దుఃఖము అది ఒక పదము. మనపడే బాధ దాని రూపము. మనకు ఆనందము ఆనందమునకు మనయొక్క అనుభవమే స్వరూపము. ఇది ఒక పేరు. దీనికి ఇదే ఒక స్వరూపము. ఈ స్వరూపమే దీని ప్రమాణము. అదే విధముగా ఒక్కొక్క పదమునకు ఒక్కొక్క స్వరూపం వుంటుంది. కానీ ఈ సత్యాన్ని యీనాటి భౌతిక శాస్త్రజ్ఞులు చక్కగా గుర్తించటానికి ప్రయత్నించటంలేదు. ఒక్కొక్క dictionary లోపల అనేక పదములంటూ వుంటున్నాయి. ఆ పదములకు అనేక రకములైన నానార్థములు వుంటున్నాయిగాని ఆ అర్థములంతా వాడు విశ్వసిస్తున్నాడా? లేదా? ఇది విశ్వసిస్తున్నాడు. ఒకే dictionary లోపలనే GOD అనే పదం వుంటున్నది ఆ పదమునకు ఒక స్వరూపం వుండాలి కదా? ఆ స్వరూపమే లేకపోతే ఈ పదం యీ dictionary లోనికి ఎట్లా వచ్చింది? దీన్ని మాత్రం ఎందుకు విశ్వసించటం లేదు. ఇది కేవలము వ్యక్తిగతమైన బోధమే తప్ప సమిష్టి స్వరూపానికి సంబంధించినది కాదు. ఇది తన యొక్క భావాలను పురస్కరించుకొని తనయొక్క సంకుచితమైన తత్వాన్ని పురస్కరించుకొని దానిని అనుభవిస్తున్నాడు. కనుక ప్రపంచమున వున్నటువంటివి రెండు. ఒకటి నామము రెండవది రూపము. భగవన్నామము చేత నామిని పట్టుకొని వేదాంతము ప్రబోధిస్తున్నది. రూపాన్ని పురస్కరించుకొని నామాన్ని పట్టటం కష్టమవుతుంది. ఒక పేంటు ఒక షర్టు వేసుకొని క్రాఫ్ పెట్టుకొని యింటెత్తు వుంటాడు అతనిని తీసుకు రమ్మంటే యింతమందిలో ఎవరిని తీసుకొని రాగలడు? ఒక పేరు చెప్పి ఫలాని వ్యక్తిని తీసుకుని రమ్మంటే ఆ లక్షమందిలో కూడను ఫలాని పేరు చెప్పటప్పటికి అవ్యక్తి లేచి వస్తాడు. నామముచేత రూపాన్ని మనము సులభంగా సాధించవచ్చు. కనుక స్మరణాయింతయుక్తోపాయమని ప్రబోధిస్తూ వచ్చింది.

విద్యార్థులారా! భారతీయ విజ్ఞానమనేది సమస్త శాస్త్రములనూ కుడించి పెట్టినది. ఈ భారతీయ విజ్ఞానములో లేనటువంటిది మరియే విజ్ఞానమునందు కూడను కానరాదు. కానీ ఆ విజ్ఞాన స్వరూపాన్ని మీరు గుర్తించలేరు దీన్ని మీరు ఆచరణలో వుంచటానికి ప్రయత్నించలేరు. కనుక వేదాని మహత్తర శక్తి మనకు అర్థం కాకుండా పోతుండాది. ఇందులో ప్రవేశించండి. దాన్ని సరియైన ఆచరణలో పెట్టండి. తద్వారా మనకు ఆనందము ప్రాప్తిస్తుంది. కనుక భారతీయ

విజ్ఞాన మనేది ధర్మమయమైనది. ధర్మమే జీవితము యొక్క పవిత్రమైన సూత్రము అదే ప్రాణము. ధర్మమనగా ఏమిటి? ధర్మమనగా ధారణయతీతి ధర్మః అనిఅన్నారు. ధరించినదే ధర్మమన్నారు. కాని దీనికి సరియైన వ్యుత్పత్తి కలుగదు. ఒక్కొక్కదానికి ప్రాణప్రదమైన సూత్రం వుంటుంది. ఇది అగ్ని అగ్ని అంటే అగ్నిని ఏమి ధరించింది? వేడిని ధరించింది. వెలుతురును ధరించింది. ఈ వేడి వెలుతురు రెండు వున్నప్పుడే అది అగ్ని అనే సత్యాన్ని నిరూపించవచ్చు. ఈ వేడి వెలుతురు లేకపోతే అది బొగ్గు అవుతుంది గాని అగ్ని కాదు. కనుక బొగ్గును ధరించినది వేడి వెలుతురు అందుకే దానికి అగ్ని అని సార్థకమైంది. అగ్నికి ధర్మమేమిటి? వేడి వెలుతురు అందించుటయే దాని ధర్మము. ఇది ice. స్వరూపం ఏమిటి? ఏదో తెల్లగా వుంటుంటాది ఇది చల్లగా వుంటుంది అంటాడు. ఇది చల్లగా లేకుండా వేడిగా వుంటే యిది ఐస్ కాదు నిప్పవుతుంది. ఇది చక్కెర అంటున్నాము. చక్కెరను ధర్మమేమిటి? తీపి చక్కెర యొక్క ధర్మము. తీపి లేకుండా పోతే అది వుప్పుగా మారిపోతుంది. లేక మట్టిగా మారిపోతుంది. కనుక చక్కెర ధర్మము తీపి. అగ్ని ధర్మము వేడి వెలుతురు ఐస్ ధర్మము చల్లదనము

ఆ విధముగానే మానవుని ధర్మమేది? ఏరీతిగా వుంటుంటాది? త్రికరణ శుద్ధిగా వుంటుంది. తలచిన తలపు చెప్పేది మాట యీ మూడింటి యొక్క ఏకత్వము ధరించినదే మానవత్వము. కనుకనే యీనాటి మానవుని యందు యీ మూడు లేకుండా పోవటం చేత ధర్మము క్షీణించింది. కనుకనే విజ్ఞానమనేది రూపు మాసింది. దేశము యొక్క క్షేమము, సౌభాగ్యమంతా నిర్మూలమయింది. కేవలము భద్రత లేకుండా పోతుండాది. న్యాయ, శాంతులతో శూన్యమై పోతుండాది. అంతా ధనము, ధనము. ఈ ధనము చేతనే నీతి నిజాయితీలను కోల్పోతున్నాము. నీతి నిజాయితీలు కోల్పోయి సంపాదించే ధనము మట్టితో సమానము. అట్టి ధనము తన వెంట ఏనాడూ రాదు. కేవలము ప్రోగుచేసి భద్రము చేసుకున్నంత మాత్రమున అది సుఖసంతోషమును యిస్తుందా? లేదు లేదు. తేనె టీగలు ప్రతి పుష్పమునందలి తేనెను ప్రోగు చేసుకొని ఒకదగ్గర చేరుస్తాయి గాని యేమాత్రము అనుభవించక ఒకదగ్గర దాచి వుంచుతాయి. కానీ వేటగాడు దానిని పొగను వేసి వేడి నీరు చల్లి వాటిని చంపివేసి ఆ తేనెను అపహరిస్తున్నాడు. అన్యాయముతో ఆర్జించిన ధనము మనకు ఏమాత్రము చిక్కదు. దీనికి నలుగురు దొంగలు వుంటున్నారు. మొట్టమొదటి దొంగ గవర్నమెంటు వారు ఏదో నెపము పురస్కరించుకొని టాక్సు క్రిందనో రైడ్ క్రిందనో దానిని కొంతవరకు

అపహరిస్తారు. రెండవది అగ్ని. అది ఏదో ఒకవిధముగా దహింపచేసి యీ అన్యాయ సహితమైన ధనమును అపహరిస్తుంది. మూడవది దొంగ. ధనము మనదగ్గర చేరిందంటే దొంగదృష్టి మనపైన పడుతుంది. ఏదో ఒకటి పురస్కరించుకొని దొంగచాటి అపహరించటానికి ప్రయత్నిస్తాడు. యింక నాల్గవది రోగము. ఈధన ముల్లన్నిటిని క్షీణింప చేయటానికి అనేక విధములైన రోగములు ప్రారంభమవుతాయి, నోరు తెరచి అడిగిన బిచ్చగానికి ఒక నయాపైసా వేయరుగాని ఆ రోగము వచ్చిందంటే డాక్టర్లకు వేలు వేలు యేమాత్రమైన లెక్కచేయక త్యాగం చేస్తారు. కనుక యీ న్యాయరహితంగా వచ్చిన ధనము యీరకమైన మార్గములలో వ్యర్థమై పోతుంది

కనుక విద్యార్థులారా! భావిభారతోద్ధారకులారా! మీరు యీవిధమైన దానిని దృష్టియందుంచుకొని ఏవిధమైన అన్యాయ మార్గములో ప్రవేశించక న్యాయ రీతిగా నీతి నిజాయితీలనే చక్రాలు ధరించి సత్యప్రేమలచేత యీధర్మమును మనము అభివృద్ధిగావించాలి. అప్పుడే యీదేశము తిరిగి ప్రాచీనకాలము భారత దేశముగా రూపొందుతుంది. భారతదేశమునందున్న యీ ధర్మసూత్రములు ఏనాటికి ఎవ్వరు కూడా అపహరించటానికిగాని నిర్మూలము గావించటానికిగాని యేమాత్రము సాధ్యము కాదు. దీనికి మూలాధారము భగవద్భక్తి. ఈభక్తియే లేకుండిన దీనిని వీరు సాధించలేరు. విద్యార్థులారా! జగత్తుని సంరక్షించలేని భగవత్ తత్త్వము తప్ప తుపాకులు ఏ బాంబులు ఏ అస్త్రములు ఏ గవర్నమెంటు చేత కాదు. కనుకనే ప్రార్థన చేసి దైవముచేత జగత్తును కళ్యాణము చేయూరునట్లుగా మీరు ఆశించటం అత్యవసరము. భగవదనుగ్రహము తప్ప యీనాడు చెలరేగిన అశాంతులను, అభద్రతలను యేమాత్రము మరొక మార్గము కనుపించటంలేదు. ఇది నేటి విద్యార్థుల శక్తిసామర్థ్యముల చేతనే భవిష్యత్తులో వల శాంతిభద్రతలు చేకూర్చగలరు! ఆధ్యాత్మ ఖనిజ సంపత్తికి ఆలవాలమైన భారతదేశము అన్యాయ అక్రమ అసత్యములనే పైశాచిక ప్రవృత్తులు ప్రళయ తాండవము చేస్తున్న సమయంలో దీనిని న్యాయ, ధర్మ, సత్య ప్రేమ లనే సహన వృత్తుల చేత శాంతి భద్రతలు చేకూర్చటానికి విద్యార్థులే దీనికి తగిన సమర్థులు. ఇలాంటి విద్యార్థులు అనేకమంది యీనాడు భారతదేశములో ఆవిర్భవించాలి.

ఒక్క ప్రహ్లాదుడు ఒక్క తండ్రిని మాత్రమే మార్చగలిగాడు. కానీ మీరందరు మీతల్లి తండ్రులను మార్చి వారందరిని తగిన మార్గము లోపల ప్రవేశపెట్టి తగిన ఆదర్శమును నిరూపించాలి. ప్రహ్లాద తత్త్వమును మీరు అను

సరించాలి. అతను మనయొక్క ధ్యాసలో వుండిన వాడే. అతను స్వరూపుడంటే. అతనికి బోధించిన గురువులు మంచివారే కానీ తండ్రి యొక్క దుర్బోధల చేత తండ్రి యొక్క కఠినమైన చర్యల చేత ప్రహ్లాదునికి ఈ ఆచరణము ల ప్రబోధిస్తూ వచ్చారు. కానీ ఈ ప్రహ్లాదుడు గురువులకు కూడను సరియైన గుణములు నేర్పుతూ వచ్చాడు. ఆ గురువులు కూడను హృదయాన్ని మార్చుకొని హిరణ్యకశిపుని దగ్గరకు వచ్చి 'ఓ రాక్షస ప్రభూ! ఈ పిల్లవాడు సామాన్యుడు కాదు. ఇతను మహాశక్తిసంపన్నుడు. ఇలాంటి వానిని మీరు శిక్షించటం మంచిది కాదు.

తన్నని శాచరులు పొడవ దైత్యకుమారుడు మాటి మాటికో
పన్నగశాయి! యో దనుజ భంజన! యో జగదీశ! యో మహా
పన్న శరణ్యా! యో నిఖిల పావనా! యనుచును నుతించెగాని తా
గన్నుల నీరు లేడు భయకంప సమేతుడు గాడు

సామాన్యపిల్లలైతే ఈ పెట్టే బాధలకు ఎంత బాధలననుభవించాలి. కానియితనియందు ఇలాంటి చర్యలు ఏమాత్రం కనుపించటం లేదు. చిరునవ్వులు చిందులు త్రొక్కుతున్నాడు. అగ్నిలో వేసినప్పుడు కూడను ఆనందంగా నారాయణా నామ చింతన చేస్తున్నాడు. సముద్రములో ముంచినప్పటికి హరినాం హరినాం అని నామస్మరణ చేతనే కాలము సార్థకం గావించు కుంటున్నాడు. దేహము వదలి దేహానిమిత్తము స్మరిస్తున్నాడు. ఇలాంటి బిడ్డ ఒక్కడు వుండిన చాలు.

ఈ జగత్తంతయు ఈనాడు అభివృద్ధిగాంచుచున్న భౌతిక విజ్ఞాన స్థితియందు సాంకేతిక పరిజ్ఞాన తత్వమందు విద్యార్థులు సత్యాన్ని గుర్తించి వర్తించటానికి ప్రయత్నించాలి. విద్య అనగా కేవలము గ్రంథ పరిచయము కాదనే సత్యాన్ని అనిల్ కుమార్ ఇంతకు పూర్వమే చెప్పాడు.

మేఘములు మింటిపై చేరి మెరయుచుండ
వాటి దాపున విద్యుత్తు వరలునట్లు
విద్యవెనుక జ్ఞానంబు వెలయవలయు

మన హృదయమనే ఆకాశములో భావములనే దట్టమైన మేఘములు కప్పినప్పుడు దానిలో దైవచింతన అనే తేజస్సు వచ్చినప్పుడు తద్వారా ఎంతో శాంతి ఎంత ప్రకాశము ఆవిర్భవిస్తుంది. కనుక మనయొక్క భావములు సరిగా చింతించాలి. మన హృదయమే ఆకాశము. మన భావములే మేఘములు. మనస్సే చంద్రుడు. మన బుద్ధే సూర్యుడు. కాని అప్పుడప్పుడు దట్టముగా మేఘములు కప్పుతుంటాయి. ఈ హృదయాకాశములో. ఆ ఆకాశములో దట్టమైన మేఘములు కప్పినప్పుడు ఈ

మనస్సు, బుద్ధి అనే సూర్యచంద్రాదులు మరుగైపోలేరు. కాని ఎంతసేపు మరుగౌతారు. కొంతసేపు మాత్రమే. ఈ మేఘములు కదలిపోయే మేఘములు. స్థిరమైన మేఘములు కావు. కొంతసేపు మనం ఓపిక పట్టుకుంటే ఆ భయములు ఉద్రేకములు, ఉల్లాసములు ఇవన్నీ క్రమక్రమేణా మార్పు చెందుతాయి. మార్పుచెందిన లక్షణమే మనస్వరూపాన్ని మనం దర్శించవచ్చు. అప్పుడే మన యొక్క బుద్ధులు ప్రకాశిస్తూ వుంటాయి. కనుక శాంతమును మనము పోషించుకోవాలి. శాంతమును మనము సాధించాలి. ఈనాటి పిల్లలు తారుణ్యములోనే ఉద్రేకము ఏ మాత్రము దీనికి అవకాశము నందించరాదు. ఈనాటి జగత్తులోపల విద్యార్థులవిప్లవము ఇలాంటి ఉద్రేకముతోనే కూడి వుంటున్నాది. అది వేడి రక్తము యొక్క ప్రభావము. ఆ వయస్సు యొక్క సహజము. కాని మనము అది సహజంగా భావించరాదు. ఆ వయస్సునందే మనశక్తి సామర్థ్యములంతా వుపయోగించాలి. ఇంద్రియ నిగ్రహము ఆ వయస్సునందే చేయాలి. ఏదో వయస్సు అయిన తరువాత అప్పుడు ఇంద్రియ శక్తిని సాధించాలంటే ఎట్లా సాధ్యమవుతుంది.

ఇంకా కొంతమంది ఈ వయస్సులోపల భగవచ్చింతన ఎందుకు. చక్కగా వుద్యోగము చేసి ధనము సంపాయించి అంత్యములోపల మంచం పైన కూర్చుని రాం రాం అనుకుంటే చాలదా అని అనుకుంటారు. ఇంకా కొంతమంది రిటైరైన తరువాత ఆధ్యాత్మిక సంస్థలో ప్రవేశిస్తామంటారు. ఈ రిటైరుకి ఏ మాత్రము అంత్యము లేదు. తిరిగి రీ-టైరు చేసుకొని పోతుంటారు, మరి ఏదో వుద్యోగములో ప్రవేశిస్తారు. చచ్చేంత వరకు ధనమాశ వీరు వదలరు. ఇంక ఎప్పుడు వీరు ఆధ్యాత్మికములో ప్రవేశిస్తారు.

పద పద మంచు కింకరులు పాశము లాగెడు వేళ బంధువుల్
దబదబ మంచు బైట పెట్టెడిక లాభము లేదని చెప్పువేళ
ఆలుబిడ్డలు లబలబ ఏడ్చువేళ
తరమా హరి నామము నోట బల్కగన్.

అప్పుడు హరిహరి అని చెప్పటానికి సాధ్యమవుతుందా? ఇది అసాధ్యము. కనుక ఈ వయస్సునందే దీనిని పోషించుకోవాలి. Start early Drive slowly Reach safely. ఈ వయస్సులో పలే ఆధ్యాత్మిక చింతన ప్రోత్సాహకరించుకోవాలి. వర్షాకాలము నందే ఈ టాంకులను జలముతో నింపుకోపోతే ఎండాకాలములో ఏ విధముగా నీవు అనుభవిస్తావు. కనుక ఈ వయస్సునందే దైవతత్వాన్ని హృదయమనే టాంకులో నింపుకోవాలి. వృద్ధాప్యములో దానిని వుపయోగించుకో

102069113

వచ్చు. pension వలె. దీనికి తగిన కృషి చెయ్యాలి విద్యార్థులు. కనుక ఎవరేమి చెప్పినా మీ విద్యతో బాటు ఆధ్యాత్మిక విద్యను కూడను అనుసరించాలి. ఒక్క చక్రము సైకిలు యెనాటికైనా ప్రమాదమే. రెండు చక్రముల వాహనమే ప్రమాదంగా వుంది. ఒక చక్రము సైకిలు ప్రమాదము కల్గించకుండా వుంటుందా! ఒక రెక్కతో ఏ పక్షి గగనానికి ఎగరదు. రెండు రెక్కలు చక్కగా వుండినప్పుడే గగన ప్రయాణము చేస్తుంది. కనుక మానవునికి

ఇహమున సుఖింపు హేమతారక విద్య
పరమును సుఖింప బ్రహ్మవిద్య

ఈ ప్రపంచ సంబంధమైన భౌతిక జ్ఞానాన్ని తెలుసుకోండి. మీరు ఆధ్యాత్మిక చదువు కూడను చదవండి. ఈ రెండింటి ఆధారము పురస్కరించుకొని యీ జీవితము మనము గడపాలి.

విద్యార్థులారా! కాలమునంతా కేవలము భౌతికము లౌకికము అనే దానికే వ్యర్థము చేయకండి. మీ యొక్క జీవితమునకు గమ్యమైన ధన్యమైన దివ్యమైన భావాన్ని కొంత కాలము సార్థకము చేసుకోండి. ఈ విధమైన విద్యార్థులు జగత్తులో అభివృద్ధి అయిపోయినప్పుడే భారత దేశము తిరిగి ప్రాచీనమైన సంస్కృతిని అనుభవిస్తూ కళ కళ లాడుతూ కిలకిల నవ్వుతుంది. దేశాన్నిగానీ, వ్యక్తినిగానీ, సమాజమునుగానీ సంరక్షించే శక్తి ఒక్క దైవమునకు తప్ప అన్యులకు మాత్రము అవకాశము లేదు. కనుక ఆ దివ్యశక్తిని మీరు అభివృద్ధి గావించుకోండి. ఆ దివ్య శక్తిని మీరు పోషించినది కాదు. సంపాదించుకున్నది కాదు. ఇది సహజ శక్తి. ఇదియే నీయొక్క దివ్యతత్త్వము. అందువలనే 'ఏకో వశీ సర్వభూతాంతరాత్మ' అని ఒకే దివ్యత్వము అందరియందు ఉన్నదనే సత్యాన్ని ప్రబోధిస్తూ వచ్చాయి మన వేదాంత గ్రంథములు. మొట్టమొదట విద్యార్థులు అహంకారము నిర్మూలము చేసుకోవాలి. వినయ విధేయతలు పెంచుకోవాలి. పెద్దలు చెప్పేదానిని శాంతంగా మనము విని సరియైన రీతిలో అందులో ప్రవేశించాలి. అహంకారమే మానవుని అంధుని చేస్తుంది. కనుక అహంకారమునకు అవకాశము ఇవ్వకూడదు. విద్యార్థులారా! పదునాలుగు దినములనుండి మీరు నేర్చుకున్న విషయముల లోపల ఏ కించిత్ భాగమైనా మీ హృదయమందు నింపుకుని తద్వారా ఆచరణయందు పెట్టి తగిన ఆదర్శమును అందిస్తారని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.